బీఈడీ పరీక్ష ఫలితాల విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబర్ 4: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని బీఈడీ పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్టు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. బీఈడీ సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు. ఈ ఫలితాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ముషీరాబాద్, అక్టోబర్ 4: టీఎస్ ఎస్‌పీడీసీ ఆజామాబాద్ డివిజన్ 11కేవీ శంకర్‌మఠ్, తులసీనగర్, ఫీవర్ ఆసుపత్రి, శాస్త్రీనగర్, అడిక్‌మెట్, బాలాజీనగర్ ఫీడర్ల పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం(నేడు) విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఆజామాబాద్ డివిజన్ ఏడీఈ ఎం.విజయభాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు.

ఉదయం 10 నుంచి 11.30 గంటల వరకు

శంకర్‌మఠ్ ఫీడర్ పరిధిలోని పద్మ కాలనీ, శంకర్‌మఠ్, నల్లకుంట, మాతృశ్రీ స్కూల్, అమర్ మెటర్నీ ఆసుపత్రి పరిసరాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తారు.

ఉదయం 11 నుంచి 1గంట వరకు

ఫీవర్ ఆసుపత్రి, తులసీనగర్, శాస్త్రీనగర్ ఫీడర్ల పరిధిలో తులసీనగర్, గోల్నాక, 6 నంబర్ మొయిన్ రోడ్డు, ఫీవర్ ఆసుపత్రి, అంజయ్య క్వార్టర్స్, తెలంగాణ యువతి మండలి, బర్కత్‌పుర ప్రెటోల్ బంక్, రాంనగర్, శాస్త్రినగర్, మోహన్‌నగర్, జెమినీకాలనీ, సెయింట్ పాయి స్కూల్ పరిసరాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తారు.

మధ్యాహ్నం 1.30 నుంచి 4 గంటల వరకు

అడిక్‌మెట్, బాలాజీనగర్ ఫీడర్ పరిధిలోని అడిక్‌మెట్, పోస్టాఫీసు, లలితానగర్, గణేశ్‌నగర్, విద్యానగర్, బాలాజీనగర్, అంబర్‌నగర్, లలితానగర్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదు. వినియోగదారులు సహకరించి సిబ్బందికి సహకరించగలరు.

సమస్యల పరిష్కారంలో విఫలం

● ప్రభుత్వం ఏర్పాటై నెలలు గడుస్తున్నా.. ఎక్కడి సమస్యలు అక్కడే: ఎమ్మెల్యే తలసాని


పార్కు ఆవరణలో వాకర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

అమీర్‌పేట్, అక్టోబర్ 4: ప్రజా సమస్యలు పరిష్కరిచడంలో ప్రభుత్వం విఫలమైందని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతుల కల్పన కోసం గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క సనత్‌నగర్ డివిజన్‌లోనే ఈఎస్ఐ గ్రేవ్‌యార్డు అభివృద్ధి, కైలాష్‌నగర్‌లో మల్టీ పర్పస్ కమ్యూనిటీహాల్, ఫతేనగర్ ఫ్లై ఓవర్ విస్తరణ, సనసత్‌నగర్ బాలానగర్ అండర్ పాస్ నిర్మాణాలకు కోట్లాది నిధులను మంజూరు చేసిందని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 9 నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు ఆయా పనులు ఇంచు కూడా ముందుకు సాగలేదని విమర్శించారు. దీపావళి తర్వాత తాను తిరిగి కార్యక్షేత్రంలోకి అడుగుపెడుతన్నానని, ప్రజా సమస్యలపై పోరాడతానని ఎమ్మెల్యే స్పష్టం చేశా రు. శుక్రవారం సనత్‌నగర్ డివిజన్‌లోని కేఎల్ఎన్ పార్కులో వివిధ శాఖ ల అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా వ్యర్థాలను తరలించే వాహనాలను జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం పార్కు ఆవరణలో ఏర్పాటు చేసిన మంచి నీటి ప్లాంట్‌ను ప్రారంభించారు. ఓపెన్ ఎయిర్ జిమ్, చిల్డ్రన్స్ ప్లే ఏరియాలోని పరికరాలు పని చేయడం లేదంటూ వాకర్లు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. పార్కు సందర్శకుల కోసం నిర్మించిన మూత్రశాలలు నిర్వహణ లోపంతో అధ్వాన్నంగా మారాయని, వీటిని పే అండ్ యూజ్ పద్ధతిన ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించాలని పలువురు చేసిన సూచనను ఎమ్మెల్యే తలసాని వెంటనే జీహెచ్ఎంసీ అధికారులకు సూచించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పార్కును అన్ని విధాలుగా అభివృద్ధి చేశామని, యోగా సాధకుల కోసం షెడ్డు నిర్మాణం చేపట్టామన్నారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ రజనీకాంత్, ఈఈ వెంకటనారాయణ, జలమండలి జీఎం హరిశంకర్, హార్టికల్చర్ డీడీ చంద్రశేఖర్, ఏఎంవోహెచ్ డాక్టర్ చంద్రశుఖర్‌డ్డి, బీఆర్ఎస్ నాయకులు కొలను బాల్‌రెడ్డి, షాబాద్ శ్రీనివాస్‌రావు, వాకర్స్ పాల్గొన్నారు.

ఐరన్ స్టెయిర్స్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తలసాని

ఐరన్ స్టెయిర్స్ ప్రారంభం..

ఎస్ఆర్‌నగర్ వయోధికుల మండలి కార్యాలయంలో కొత్తగా నిర్మించిన ఐరన్ స్టెయిర్‌ను ఎమ్మెల్యే తలసాని మండలి అధ్యక్షుడు మాణిక్‌రావు పాటిల్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం సత్యనారాయణ వ్రతంలో పాల్గొన్నారు. ఎటువంటి పరిస్థితుల్లో కూడా వయోధికులు తమ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయరాదని, అన్ని వేళల్లా అందుబాటులో ఉంటానని, ఎటువంటి సమస్యలనైనా తన దృష్టికి తీసుకురావచ్చని, వాటి పరిష్కరానికి కృషి చేస్తానని వయోదికులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఎన్.శేషుకుమారితో పాటు వయోధికుల మండలి ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు బ్యాగుల అందజేత

విద్యార్థులకు బ్యాగులను అందజేసిన మహాలక్ష్మి క్లబ్ ప్రతినిధులు

బన్సీలాల్‌పేట్, అక్టోబర్ 4: పద్మారావునగర్‌లోని హమాలీబస్తీ అంగన్‌వాడీ కేంద్రంలో మహాలక్ష్మి క్లబ్ హైద్రాబాద్ చాప్టర్ ఆధ్వర్యంలో శుక్రవారం చిన్నారులకు స్కూల్ బ్యాగులను అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు భాను రామ్‌నాథ్, డాక్టర్ గిరిజ, నవీన్, శ్యా మల, గిరిజ, సంధ్యారాణి, జ్యోతి, సావిత్రి, నీరజ, నాగమణి, అంగన్‌వాడీ టీచర్ కుల్సుమ్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

రూ.10లక్షల నగదును అందజేస్తున్న బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్‌రెడ్డి

బొల్లారం, అక్టోబర్ 4: మహిళలు ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు స్వయం సహాయక రుణాలను సద్వినియోగం చేసుకోవాలని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం న్యూబోయిన్‌పల్లిలో బాపూజీనగర్ కమ్యూనిటీ హాల్‌లో భవాని మహిళా పొదుపు సంఘం గ్రూపు సభ్యులకు మంజూరైన రూ.10లక్షల నగదును ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో చిలుక నవీన్, పద్మ, సౌజన్య, స్రవంతి, దేవిక, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రాపంచిక దృక్పథంతో రచనలు రావాలి

సమావేశంలో మాట్లాడుతున్న తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు డాక్టర్ మామిడి హరికృష్ణ

చిక్కడపల్లి, అక్టోబర్ 4: ప్రాపంచిక దృక్పథంతో రచనలు రావాలి తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు డాక్టర్ మామిడి హరికృష్ణ అన్నారు. తెలంగాణ సాహితి, డివైఎఫ్ఐ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం బాగ్‌లింగంపల్లి సుందర్య విజ్ఞాన కేంద్రంలో యూత్ లిటరరీ ఫెస్ట్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మామిడి హరికృష్ణ మాట్లాడుతూ యూత్ లిటరరీ ఫెస్ట్ యువత సృజనాత్మకతకు పెద్దపీట వేసిందన్నారు. తెలంగాణ సాహితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు అనంతోజు మోహనకృష్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డాక్టర్ ఎస్.రఘు, తెలంగాణ సాహితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఆనందాచారి, డీవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఆనగంటి వెంకటేశ్, రచయిత్రి నస్రీన్ తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణ తరువాతే నియామకాలు చేపట్టాలి

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబర్ 4: ఎస్సీ వర్గీకరణ తరువాతే ఉద్యో గ భర్తీ ప్రక్రియను పూర్తి చేయాలని మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ (ఎంఎస్ఎఫ్) ఓయూ అధ్యక్షుడు ఎల్.నాగరాజు డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ పోరా టం, అమరుల త్యాగాల వల్ల ఎస్సీ వర్గీకరణ న్యాయమైనదేనని సుప్రీం కోర్టు తీర్పు వెలువరించిందని గుర్తుచేశారు. ఉపకులాల్లో అణిచివేత, వెనుకబాటుతనం ఉందని గుర్తించి, వారికి న్యాయం జరుగాలనే ఉద్దేశంతో న్యాయస్థానం తీర్పు వెలువరించిందని అభిప్రాయపడ్డారు. ఉద్యోగ భర్తీ నోటిఫికేషన్లలో ఆర్డినెన్స్ జారీ చేస్తామని సీఎం హామీ ఇచ్చారని చెప్పారు. ఒక పక్క రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ నియామకాల ప్రక్రియ వేగవంతం చేస్తోందని, దీంతో తాము నష్టపోయే ప్రమాదముందని వాపోయారు. అన్ని నోటిఫికేషన్లలో వర్గీకరణ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇచ్చిన మాటకు కట్టుబడి హామీ ని నిలబెట్టుకోవాలని, లేనిపక్షంలో మరోయుద్ధం తప్పదని హెచ్చరించారు.

రెడ్డి ప్రజాప్రతినిధుల సభను విజయవంతం చేయాలి

సికింద్రాబాద్ సమావేశంలో మాట్లాడుతున్న రెడ్డి జేఏసీ ప్రతినిధులు

బేగంపేట్, అక్టోబర్ 4: ఈనెల 6న హైటెక్ సిటీలోని శిల్పా కళావేదికలో రెడ్డి ప్రజాప్రతినిధుల సభను విజయవంతం చేయాలని రెడ్డి జేఏసీ చైర్మన్ రాంరెడ్డి, కోచైర్మన్ ఫైళ్ల హరినాథ్ రెడ్డి కోరారు. శుక్రవారం సికింద్రాబాద్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రెడ్డి కార్పొరేషన్‌ను ఏర్పాటు చేస్తానని మ్యానిఫెస్టోలో పెట్టారని, వెంటనే ఏర్పాటు చేయాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి రెడ్లు పెద్ద ఎత్తున హాజరై సత్కార సభను విజవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రెడ్డి జేఏసీ ప్రతినిధులు వసంతారెడ్డి, మాధవరెడ్డి, మహేందర్‌రెడ్డి, దయాకర్‌రెడ్డి, పుష్పలతారెడ్డి, రాధికరెడ్డి, లావణ్యరెడ్డి, నీరజారెడ్డి, సంజీవరెడ్డి, బాలకిషన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వెస్ట్‌జోన్ ఎన్ఎస్ఎస్ ప్రీ ఆర్డీ ఎంపిక షురూ..

ఎన్ఎస్ఎస్ ప్రీ ఆర్‌డీ ఎంపికకు హాజరైన ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబర్ 4: వెస్ట్‌జోన్ ఎన్ఎస్ఎస్ ప్రీ రిపబ్లిక్‌డే పరేడ్ (ప్రీ ఆర్‌డీ) ఎంపిక శుక్రవారం ప్రారంభమైంది. ఓయూ ఏ గ్రౌండ్‌లో ఎంపిక ప్రక్రియకు ఎన్ఎస్ఎస్ వలంటీర్లతో పాటు ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ వర్సిటీ వలంటీర్లు హాజరయ్యారు. ఓయూ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ ప్రొఫెసర్ సవీన్ సౌడ మాట్లాడుతూ రిపబ్లిక్ డే పరేడ్‌లో తెలంగాణ ప్రతిభ చాటి రాష్ట్ర కీర్తి పతాకాలు ఢిల్లీలో ఎగురవేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వివిధ కళాశాలల ప్రోగ్రాం ఆఫీసర్లు అపర్ణ, డాక్టర్ శోభారాణి, డాక్టర్ రాధారాణి, డాక్టర్ జగన్, డాక్టర్ జజ్జీశ్వర్, డాక్టర్ భాస్కర్‌రెడ్డి, డాక్టర్ వెంకటేశ్వర్లు, శ్రీధర్, డాక్టర్ మీన తదితరులు పాల్గొన్నారు.

పాత నేరస్థుడి అరెస్ట్.. బంగారు నగలు స్వాధీనం

బేగంపేట, అక్టోబర్ 4: తాళం వేసి ఉన్న ఇండ్లను టార్గెట్ చేసుకొని పట్టపగలే దొంగతనాలకు పాల్పడుతున్న ఓ పాత నేరస్థుడిని శుక్రవారం సెక్రటరియట్ పోలీసులు అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ కథనం ప్రకారం.. ఏపీ తూర్పుగోదావరి జిల్లా మల్లేపల్లి గ్రామానికి చెందిన మణికంఠ(21) బతుకుదెరువు నిమిత్తం నగరానికి వచ్చి ఎంఎస్ మక్తాలో ఉంటున్నాడు. క్యాటరింగ్ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. విలాసాలకు అలవాటు పడిన మణికంఠ వచ్చే ఆదాయం సరిపోకపోవడంతో చోరీల బాట పట్టాడు. కాగా, ఎంఎస్ మక్తాలో ఉంటున్న ఆటో డ్రైవర్ బాలకృష్ణ ఈ నెల 2వ తేదీన హన్మకొండకు భార్యతో కలిసి వెళ్లాడు. 3వ తేదీన తిరిగి వచ్చి చూడగా.. ఇంటి తాళాలు, ఇంట్లో ఉన్న బీరువా పగలగొట్టి ఉంది. దీంతో సెక్రటరియట్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు పాత నేరస్థుల కదలికలపై నిఘా పెట్టారు. విశ్వసనీయ సమాచారం మేరకు మణికంఠను అదుపులోకి తీసుకొని విచారించారు. దీంతో అతడు నేరం చేసినట్టు అంగీకరించాడు. అతడి నుంచి చోరీ సొత్తు స్వాధీనం చేసుకొని మణికంఠను రిమాండ్‌కు తరలించారు. మణికంఠ గతంలో కూకట్‌పల్లి, బోరబొండ, అల్లాపూర్‌లో కలిపి ఆరు దొంగతనం కేసుల్లో నిందితుడుగా ఉన్నాడని పోలీసులు తెలిపారు.

పండుగల సందర్భంగా సమీక్ష

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబర్ 4: బతుకమ్మ, దసరా నవరాత్రుల సందర్భంగా జీహెచ్ఎంసీ అధికారులతో నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్‌రెడ్డి శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. తార్నాక లోని డిప్యూటీ మేయర్ క్యాంపు కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ ప్రజలకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ట్రాఫిక్ నియంత్రణ, పారిశుధ్యం, భద్రత చర్యలపై దృష్టిపెట్టాలని సూచించారు. భద్రత కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో పాటు అవసరమైన చోట్ల పోలీసు సిబ్బంది, వలంటీర్లను మోహరించనున్నట్లు తెలిపారు. బతుకమ్మ వేడుకలు జరిగే ప్రదేశాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని, అన్ని ప్రాంతాల్లో పండుగ ఉత్సాహంగా నిర్వహించేందుకు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. అత్యవసర పరిస్థితులకు స్పందించేందుకు హెల్ప్ లైన్ నంబర్లను అందుబాటులో ఉంచాలని, ఎలాంటి అపాయాలు సంభవించకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ సికింద్రాబాద్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సుభాష్, శానిటేషన్ డీఈ వెంకటేశ్, ఇంజినీరింగ్ డీఈ సువర్ణ, ఏఈ వేణు, ఎంటమాలజీ ఏఈ రాజశేఖర్, ఎల్క్ట్రికల్ ఏఈ శ్రీకాంత్, జలమండలి ఏఈ నిఖిత తదితరులు పాల్గొన్నారు.

బేగంపేట్‌లోని శ్రీశక్తి ఇనిస్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ పూర్వ విద్యార్థిని పోలీస్ అశ్విత ఫ్రాన్స్‌లో జరిగిన 47వ వరల్డ్ స్కిల్ కాంపిటేషన్ 2024లో బేకరీ విభాగంలో కాంస్య పథకాన్ని సాధించింది. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ఇండియా టూరిజం డైరక్టర్ శ్రీకృపాకర్, సత్య పింజల, ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ యమున, కళాశాల ప్రిన్సిపాల్ అనిత తదితరులు అశ్వితను బేగంపేట్‌లో అభినందించారు. – బేగంపేట్

సంస్కృత అకాడమీ డైరెక్టర్‌గా ప్రొఫెసర్ మధుసూదన్

ప్రొఫెసర్ పెన్నా మధుసూదన్‌ను అభినందిస్తున్న ప్రొఫెసర్ నీలకంఠం

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబర్ 4: ఓయూ క్యాంపస్‌లోని సంస్కృత అకాడమీ నూతన డైరెక్టర్‌గా ప్రొఫెసర్ పెన్నా మధుసూదన్ నియమితులయ్యారు. శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన గతంలో నాగపూర్‌లోని కవికులగురు కాళిదాస్ సంస్కృత విశ్వవిద్యాలయ వైస్‌చాన్స్‌లర్‌గా పనిచేశారు. పూర్వపు డైరెక్టర్ ప్రొఫెసర్ నీలకంఠం మాట్లాడుతూ కాళిదాస్ సంస్కృత వర్సిటీలో మధుసూదన్ అనేక ఉన్నత పదవులు నిర్వర్తించారని గుర్తుచేశారు. అనేక కావ్యాలు రచించడంతో పాటు వాచస్పతి, శాస్త్రరత్నాకర ఇత్యాది పురస్కారాలు సైతం పొందారని వివరించారు. ఆయన సారథ్యంలో అకాడమీ మరింత ఉన్నత స్థానానికి చేరుతుందని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా కేంద్రీయ సంస్కృత వర్సిటీ వీసీ ప్రొఫెసర్ శ్రీనివాస్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

డ్రైనేజీ సమస్యను పరిష్కరించండి

కంటోన్మెంట్ బోర్డు సీఈఓకు వినతిపత్రం అందజేస్తున్న మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ టీఎన్ శ్రీనివాస్

బొల్లారం, అక్టోబర్ 4: కంటోన్మెంట్ రెండో వార్డులో నెలకొన్న డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని కంటోన్మెంట్ బోర్డు సీఈఓ మధుకర్‌నాయక్‌కు శుక్రవారం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ టీఎన్ శ్రీనివాస్ శుక్రవారం బోర్డు కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. వార్డు పరిధిలోని గన్‌బజార్, కస్తూర్బా స్కూల్ లైన్‌లో డ్రైనేజీ సమస్యతో బస్తీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో నూతన డ్రైనేజీ పైపులైన్ పనులు చేపట్టాలని కోరారు.

భక్తి శ్రద్ధలతో దేవీ శరన్నవరాత్రులు


అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే తలసాని, మాజీ కార్పొరేటర్ ఎన్.శేషుకుమారి

కరెన్సీ నోట్ల అలంకరణలో బల్కంపేట ఎల్లమ్మ

వివేక్‌నగర్ ఆలయంలో భక్తులు

సనత్‌నగర్/సికింద్రాబాద్/కంటోన్మెంట్/ముషీరాబాద్, అక్టోబర్ 4: రాంనగర్ జెమినీ కాలనీ పోచమ్మ ఆలయంలో అమ్మవారు గాయత్రిదేవీ అలంకరణలో దర్శనమిచ్చారు. కార్పొరేటర్ వి.శ్రీనివాస్‌రెడ్డి అన్నదానం ప్రారంభించారు. గంగపుత్ర రోహిత్, సిరిగిరి శ్యామ్, ప్రకాశ్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కంటోన్మెంట్ ఎనిమిదో వార్డు బొల్లారం తోట ముత్యాలమ్మ ఆలయంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం భువనేశ్వరి దేవీ రూపంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.

మోండా డివిజన్ కుమ్మరిగూడలోని రాజ రాజేశ్వరీదేవీ ఆలయంలో శుక్రవారం అమ్మవారు గాయత్రిదేవీ అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. స్థానిక కార్పొరేటర్ కొంతం దీపిక అమ్మవారికి పూజలు నిర్వహించారు.

చిక్కడపల్లి వివేక్‌నగర్ ఆంజనేయ స్వామి ఆలయం ప్రాంగణంలో భువనేశ్వరిదేవి మహాలక్ష్మి అలంకరణలో దర్శనమిచ్చారు. ఈఓ మాచర్ల దేవనాథం పాల్గొన్నారు. లోయర్ ట్యాంక్‌బండ్ కనకాల కట్టమైసమ్మ ఆలయంలో మహాలక్ష్మి రూపంలో దర్శనం ఇచ్చారు. అర్చకులు సాత్విక్‌శర్మ ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త, చైర్మన్ జి.గౌతమ్‌కుమార్‌పటేల్, ఈఓ కె.సాంబశివరావు పాల్గొన్నారు. గాంధీనగర్ ఎస్ఆర్టీ క్వార్టర్స్‌లో భీంరాజ్ ఆధ్వర్యంలో జరిగిన పూజల్లో ఎమ్మెల్యే ముఠాగోపాల్ పాల్గొన్నారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ముఠా నరేశ్, నాయకులు కుమార్, సుధాకర్ తదితరలు పాల్గొన్నారు. ఆయా డివిజన్లలోని పలు ప్రాంతాల్లోని ఆలయాల్లో అమ్మవార్లు భక్తులకు దర్శనమిచ్చారు.

గాంధీనగర్‌లో ఎమ్మెల్యే ముఠాగోపాల్, నరేశ్ తదితరులు

జెమినీకాలనీలో అన్నదానం ప్రారంభించిన మాజీ కార్పొరేటర్ శ్రీనివాసరెడ్డి

చిక్కడపల్లి: గాంధీనగర్‌లో జరిగిన బతుకమ్మ ఉత్సవాల్లో స్థానిక కార్పొరేటర్ ఎ.పావని హాజరై బతుకమ్మ ఆడారు

జెక్‌కాలనీ వాసవి సెంట్రల్ కోర్టు వద్ద రాజ్యలక్ష్మి, సంధ్య ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకలు

అర్థికంగా ఎదిగితేనే మహిళా సాధికారత

చిక్కడపల్లి, అక్టోబర్ 4: మహిళలు అర్థికంగా ఎదిగినప్పుడే మహిళా సాధికారత సాధ్యమని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. జనని ఫౌండేషన్, భారత్ కేర్ ఆధ్వర్యంలో వాస్తు హౌసింగ్ ఫైనాన్స్ సౌజన్యంతో ఊంచీ ఉడాన్‌లో భాగంగా ఉచిత కుట్ట మిషన్ శిక్షణ పూర్తిచేసుకున్నారు. సర్టిఫికెట్ల పంపిణీ కార్యక్రమం శుక్రవారం బండ మైసమ్మ కమ్యూనిటీహాల్లో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే ముఠా గోపాల్ హాజరయ్యారు. హైదరాబాద్ సంయుక్త కార్మిక శాఖ కమిషషనర్ సునత, బీఆర్ఎస్ యువజన విభాగం నాయకుడు ముఠా జయసింహ, స్థానిక కార్పొరేటర్ రచణశ్రీతో కలిసి సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ మహిళలు ఉచిత శిక్షణ కేంద్రాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా రాణించాలని సూచించారు. కార్యక్రమంలో జనని ఫౌండేషన్ ప్రతినిధి మల్లేశ్, టి.వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన లబ్ధిదారులకే డబుల్ బెడ్రూం ఇండ్లు


కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్ హేమ

సికింద్రాబాద్, అక్టోబర్ 4: అర్హులైన లబ్ధిదారులకే డబుల్ బెడ్రూం ఇండ్లు కేటాయించాలని సీతాఫల్‌మండి కార్పొరేటర్ హేమ హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి కోరారు. సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుల్ల పద్మారావుగౌడ్ సూచన మేరకు కార్పొరేటర్ హేమ నేతృత్వంలోని ప్రతినిధుల బృందం శుక్రవారం హైదరాబాద్ కలెక్టర్‌తో సమావేశమయ్యారు. వివిధ స్థానిక అంశాలపై ఎమ్మెల్యే అందించిన లేఖలను, ప్రతిపాదనలను కలెక్టర్‌కు కార్పొరేటర్ అందించారు. సీతాఫల్‌మం డి డివిజన్ సుభాష్ చంద్రబోస్ నగర్‌లో నిర్మించిన డబుల్ బెడ్రూమ్ నివాసాలను అర్హులైన స్థానికులకే కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. అదే విధంగా సాయినగర్ లో నిర్మాణాలను వెంటనే పూర్తిచేయాలని కోరారు. దోబీ ఘాట్‌లో ఇప్పటికే నిర్మించిన ఇండ్లను అర్హులకు కేటాయించాలని, అంబర్‌నగర్‌లో జీఓ58లో భాగంగా క్రమబద్ధీకరించిన పట్టాలను జారీ చేయాలనీ కోరుతూ ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ చేసిన ప్రతిపాదనలను హేమ ఈ సందర్భంగా కలెక్టర్‌కు వివరించారు. ఆయా ప్రతిపాదనలకు కలెక్టర్ సానుకూలంగా స్పందించారని హేమ పేర్కొన్నారు.

డివైడర్‌పై తిష్టవేసిన యాచకుల తరలింపు

బన్సీలాల్‌పేట్, అక్టోబర్ 4: గాంధీ దవాఖాన మెట్రో స్టేషన్ కింద రోడ్డు డివైడర్‌పై తిష్ట వేసిన యాచకులను ట్రాఫిక్ పోలీసులు తరలించారు. చిలకలగూడ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ శ్రీనివాసులు పర్యవేక్షణలో ట్రాఫిక్, జీహెచ్ఎంసీ సిబ్బం ది చర్యలు చేపట్టారు. మూడు నెలల్లో రోడ్డు దాటుతుండగా ముగ్గురు ప్రమాదవశాత్తు చనిపోయారన్నారు. మద్యానికి, మత్తు పదార్థాలకు బానిసలై, ప్రజలను, వాహనదారులను ఇబ్బంది పెడుతున్నారని ఫిర్యాదులు రావడంతో వారిని అక్కడి నుంచి పంపించి వేశారు. డివైడర్లకు ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని మెట్రో రైల్, జీహెచ్ఎంసీ విభాగాల అధికారులను కోరామని ఆయన తెలిపారు.